సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం। 13। డిసెంబర్। 2024



శ్రీఆంజనేయం..

మక్తల్‌లో ఆంజనేయస్వామి బ్రహ్మోత్స వాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



ఆవిష్కరణలు అదరహో

మహబూబ్‌నగర్‌లో సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తించాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.6 /14.7

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ, రాత్రివేళ చలి ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు జాతీయ లోక్‌అదాలత్

గద్వాల క్రైం: జిల్లాలో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ కాదగిన కేసుల పరిష్కారానికి కక్షిదారులు ముందుకు రావాలన్నారు. లోక్‌అదాలత్‌లతో కేసుల పరిష్కారంతో ఇరువర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు.

వేరుశనగ @ 6,509

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 404 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. క్వింటా గరిష్ఠంగా రూ. 6,509, కనిష్ఠంగా రూ. 3,700, సరాసరి రూ. 5,919 ధరలు వచ్చాయి. అదే విధంగా 8 క్వింటాళ్ల ఆముదాలు రాగా.. గరిష్ఠంగా రూ. 5,529, కనిష్ఠంగా రూ. 5,509, సరాసరి రూ. 5,519 ధరలు లభించాయి. 955 క్వింటాళ్ల వరి (సోన) రాగా.. గరిష్ఠంగా రూ. 2,733, కనిష్ఠంగా రూ. 1,759, సరాసరి రూ. 2,689 ధరలు పలికాయి. 76 క్వింటాళ్ల కందులు రాగా.. గరిష్ఠంగా రూ. 9,626, కనిష్ఠంగా రూ. 9,066, సరాసరి రూ. 9,326 ధరలు వచ్చాయి.

హామీల అమలులో నిర్లక్ష్యం



గద్వాల: అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నో హామీలు ఇచ్చారని.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు పర్చడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడోరోజు కొనసాగింది. వీరికి బీజేపీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అనంతరం పీఆర్టీయూ నాయకులు రంగన్న, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలతో పోల్చితే ప్రభుత్వం సమగ్రశిక్ష ఉద్యోగులకు ఇచ్చే జీతాలు తక్కువ అని అన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని, జీవిత బీమా రూ. 20లక్షలు, ఆరోగ్య బీమా రూ. 10లక్షలు, పదవి విరమణ పొందిన వారికి రూ. 25లక్షల బెనిఫిట్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉషనప్ప, గోపాల్, శేషన్న పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పు పెట్టొద్దు



గద్వాల రూరల్: వ్యవసాయ పొలాల్లో వరికొయ్యలు, గడ్డి తదితర వాటిని కాల్చకుండా భూమిలో కలియదున్నాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియా నాయక్ సూచించారు. గురువారం మండలంలోని అనంతపురం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. వరిలో తేమశాతం 17 కంటే తక్కువగా ఉండాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులతో సాగుపత్రం పొంది, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించాలన్నారు. అదే విధంగా గుర్రంగడ్డలో వివిధ పంటలను పరిశీలించారు. రైతులు వరి కోసిన తర్వాత నీళ్ల వదిలి గడ్డితో సహా భూమిని దున్నడంతో భూసారం పెరుగుతుందన్నారు. వరికొయ్యలకు నిప్పు పెట్టకుండా, ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ట్‌ను చల్లాలని.. తద్వారా అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

నెట్టెంపాడుకు నిలిచిన పంపింగ్

ధరూరు: జూరాలకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. దీంతో గురువారం నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను నిలిపివేశామన్నారు. కోయిల్‌సాగర్ 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 200, కుడి కాల్వకు 333, సమాంతర కాల్వకు 412 క్యూసెక్కులు వదలగా.. మరో 90 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రోత్సాహక నిధులేవి?

లబ్ధిదారులకు అందని ఎంసీహెచ్ సొమ్ము

- ప్రభుత్వం మారినా కనిపించని పురోగతి
- నాలుగేళ్లుగా తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో 75,133 మందికి రూ. 22.53 కోట్లు పెండింగ్



మల్దకల్ మండలం నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన బేబి 2022 సెప్టెంబర్ 14న జిల్లా ఆస్పత్రిలో మొదటి కాన్పు చేయించుకోగా మగబిడ్డ జన్మించాడు. 2024 జనవరి 17న రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహక నిధులు ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. అధికారులను సంప్రదిస్తే.. త్వరలోనే జమ అవుతాయని చెబుతున్నారు. జిల్లాలో 2020 ఏప్రిల్ నుంచి ఎంసీహెచ్ కిట్ లబ్ధిదారులందరి ప్రరిస్థితి ఇలాగే ఉంది.

గద్వాల క్రైం: మాతాశిశు మరణాలను తగ్గించడం, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రైవేటు ఆస్పత్రుల వైపు ప్రజలు వెళ్లకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంసీహెచ్ కిట్ పథకం అటకెక్కింది. కొన్నేళ్లుగా లబ్ధిదారులకు ఎంసీహెచ్ సొమ్ము అందడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకున్న బాలింతలకు పలు రకాల వస్తువులతో కూడిన కిట్ అందించడంతో పాటు ఆడబిడ్డ జన్మిస్తే రూ. 13 వేలు, మగబిడ్డ జన్మిస్తే రూ.12 వేల ఆర్థిక సహాయం అందించేలా పథకం రూపొందించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కిట్ పేరుతో ఈ పథకాన్ని అమలు చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చింది. అయితే ఎంసీహెచ్ కిట్లు అందిస్తున్నప్పటికీ.. ప్రోత్సాహక నిధులను జమ చేయకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని లేబర్ వార్డు

నీరుగారుతున్న లక్ష్యం..

జిల్లావ్యాప్తంగా 75,133 మంది లబ్ధిదారులకు రూ. 22.53 కోట్లు అందాల్సి ఉంది. గర్భిణిగా నమోదు, ఏఎన్‌సీ చెకప్, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం, శిశువుకు మూడునెలల టీకా వేయించినప్పుడు ఇలా నాలుగు విడతల్లో ఎంసీహెచ్ నిధులను లబ్ధిదారుల ఖాతాలో నిధులు జమ చేయాల్సి ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించిన రెండేళ్ల వరకు సక్రమంగానే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడేళ్లపాటు, కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరంగా నిధుల విడుదల ఊసెత్తడం లేదు. ఫలితంగా పథకం లక్ష్యం నీరుగారుతోంది.

2020 నుంచి పెండింగ్..

జిల్లాలో 2020 ఏప్రిల్ నుంచి ఎంసీహెచ్ నిధులు అందడం లేదు. ఏఎన్‌ఎంలు గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే తమ బ్యాంకు ఖాతాలో నిధులు ఎప్పుడు జమ అవుతాయంటూ తరచూ వైద్యసిబ్బందిని అడుగుతున్నారు. లబ్ధిదారులకు చెల్లించాల్సిన నిధులను అందిస్తే కాస్త ఊరట లభిస్తుందంటున్నారు. గర్భిణులు ప్రసవం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే రూ. 30వేలకు పైగా బిల్లు రూపంలో వసూలు చేస్తారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు.

మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా..



2021 డిసెంబర్ 20న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మొదటి కాన్పు చేయించుకున్నా. ఆడబిడ్డ పుట్టింది. ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ. 13వేల ప్రోత్సాహకం నేటికీ బ్యాంకు ఖాతాలో జమకాలేదు. డబ్బుల కోసం మూడేళ్లుగా ఎదురుచూస్తున్నాను.

– శిరీష, గద్వాల

చర్యలు తీసుకుంటాం..



పెండింగ్‌లో ఉన్న డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. గతంలోనే ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. ప్రతిఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయి. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ప్రభుత్వ పథకాలు యథావిధిగా కొనసాగుతాయి.

– సిద్దప్ప, జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

లక్ష్మీవేంకటేశ్వరుడికి హనుమద్ వాహన సేవ



బోడి ప్రభలో ఊరేగుతున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం హనుమద్ వ్రతం నిర్వహించారు. అంతకుముందు హనుమద్ వాహనం (బోడి ప్రభ)లో స్వామివారు ఊరేగారు. పండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, శశాంక్‌ల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గం

భక్తులందరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండి సన్మార్గంలో పయనించాలని ఉడిపి పలిమారు పీఠాధిపతి విద్యాధీశ తీర్థులు సూచించారు. ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, వేద పాఠశాలలో సంస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. నేటి ఆధునిక యుగంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ.. భక్తిభావంతో సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కాగా, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తన తల్లిదండ్రులు సేతు కావేరమ్మ, రామారావుల పేరున రూ. 4కోట్ల విలువచేసే భూములను ఆలయానికి ఇస్తూ.. అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పీఠాధిపతికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్ రావు, బాబురావు, దీరేంద్రాదాసు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, వీరారెడ్డి, పద్మారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

మానవపాడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం మానవపాడులో మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. మండల క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీడీఓ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహన్ నాయుడు, దామోదర్‌రెడ్డి, వెంకట్రాముడు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

- జిల్లాలో 25 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 8,722మంది అభ్యర్థులు
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్–2 పరీక్షలను రెండు రోజులపాటు నాలుగు దఫాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న ఉదయం 10నుంచి 12:30 గంటల వరకు పేపర్–1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ, 16న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్–3 ఎకానమి అండ్ డెవలప్‌మెంట్, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–4 తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 8,722 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని.. వీరి కోసం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 25మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 25మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 26మంది పరిశీలకులు, 74 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ వివరించారు. పరీక్ష పేపర్లు, ఓఎంఆర్ షీట్లు పకడ్బందీగా ఎస్కార్ట్‌తో పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. అభ్యర్థులు మాల్‌ప్రాక్టీస్, ఇతర అనధికార కార్యక్రమాలకు పాల్పడకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అధికారికి ఐడీ కార్డులు ఉండాలని.. ఇతరులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరాదన్నారు. అదే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్ష తేదీల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. జిరాక్స్ సెంటర్లు పూర్తిగా మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, అధికారులు నరేంద్రరావు, రామోహ్మన్ ఉన్నారు.

- ఈవీఎంల గోదాము వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని గోదాములో భద్రపర్చిన ఈవీఎంలను వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లికార్జున్, కరుణాకర్, సురేష్ తదితరులు ఉన్నారు.
- ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, సీఈఓ కాంతమ్మ, రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

చోరీల నియంత్రణకు చర్యలు : ఎస్పీ



జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సర్కిల్‌లో పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: జిల్లాలో చోరీల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్, రైల్వే స్టేషన్, రాజీవ్‌మార్గ్, రాఘవేంద్ర కాలనీ, పిల్లిగుండ్ల కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పోలీసు పెట్రోలింగ్, గస్తీని పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లా డుతూ.. ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పూర్తిస్థాయిలో ఆరా తీయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మానుష్య కాలనీల్లో గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడేందుకు వస్తుంటారని.. వారిని గుర్తించి చోరీలను అరికట్టాలన్నారు. తనిఖీల సమయంలో అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ డివైస్‌లో తీసుకోవాలని సూచించారు. విధులు నిర్వహించే సిబ్బంది ఆయా ప్రాంతాల్లోని పాయింట్స్ బుక్స్‌లో నమోదు చేయాలన్నారు. లాడ్జీలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలు చేసే క్రమంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రైల్వే ప్రయాణికుల విషయంలో క్షుణ్ణంగా ఆరా తీయాలన్నారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టాలని తెలిపారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ ఉన్నారు.

మూత ‘బడులు’

విద్యార్థులు లేరని ప్రభుత్వ పాఠశాలలను మూసేస్తున్న అధికారులు

- ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఇదే తంతు
- అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 73 స్కూళ్ల మూసివేత
- బల్మూరు మండలంలో ఒకే నెలలో మూడింటికి తాళం
- ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం చౌటతండాలో మూతబడిన పాఠశాల

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి మెరుగైన విద్య అందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఒకదిక్కు రూ.కోట్ల నిధులు వెచ్చించి.. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నట్లు ప్రగల్భాలు పలుకుతుండగా.. మరోదిక్కు క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు లేరని అధికారులు శాశ్వతంగా తాళాలు వేస్తున్నారు. బడులను నడిపిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో భరోసా కల్పించాల్సిన అధికారులు.. విద్యార్థులు లేరన్న సాకుతో బడులను మూసివేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

జీరో ఎన్‌రోల్‌మెంట్ పేరుతో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటికే చాలా వరకు పాఠశాలలకు శాశ్వతంగా తాళాలు పడ్డాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 73 పాఠశాలలను అధికారులు మూసివేశారు. ఈ విద్యా సంవత్సరం మధ్యలోనే 10 పాఠశాలలకు తాళం వేశారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలనే తాత్కాలికంగా మూసివేయాలి. కానీ, చాలా పాఠశాలల్లో మూడు నుంచి పది మంది వరకు విద్యార్థులు ఉన్నా.. వారిని ఇతర పాఠశాలలు, ప్రైవేటుకు వెళ్లమని సూచిస్తూ.. అర్ధంతరంగా బడులను మూసేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు చోటుచేసుకోగా.. పట్టణాలు, సమీపంలోని పాఠశాలల్లోకి ఉపాధ్యాయులు ప్రాధాన్యం ఇచ్చారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు రాక, వచ్చిన వారు మళ్లీ సర్దుబాటు కోసం పైరవీలు చేసుకుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఉపాధ్యాయులు లేక ఖాళీగా ఉన్న పాఠశాలలను సైతం విద్యార్థుల జీరో ఎన్‌రోల్‌మెంట్ పేరుతో మూసేస్తున్నారు. ఈ విధంగా ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాలో 46, వనపర్తి జిల్లాలో 32, జోగుళాంబ గద్వాల జిల్లాలో 10, నారాయణపేట జిల్లాలో 35 ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయి.

మూసివేసేందుకే ఆరాటం..

ఇన్నాళ్లు విద్యార్థులతో కళకళలాడిన బడులు.. ఉన్నట్టుండి బోసిపోతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ బడుల్లో నియామకం, వసతులు పెంచి తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాల్సిన అధికారులు.. బడులను మూసివేసేందుకే ప్రాధాన్యం చూపుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నా.. మరింత మందిని చేర్పించి, బలోపేతం చేయాల్సింది పోయి, ఉపాధ్యాయుల సర్దుబాటు, బదిలీల కోసం ఏకంగా బడులకే తాళాలు వేస్తుండటం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో మూతపడిన పాఠశాలల వివరాలు..

జిల్లా	ఇప్పటికే మూతబడినవి	ఈ ఏడాది మూతబడినవి
నాగర్‌కర్నూల్	73	10
మహబూబ్‌నగర్	46	7
నారాయణపేట	35	5
వనపర్తి	32	4
జోగులాంబ గద్వాల	10	-

విద్యార్థుల సంఖ్య పెంచుతాం..

జీరో విద్యార్థుల నమోదు ఉన్న స్కూళ్లను గుర్తించి తాత్కాలికంగా మూసేస్తున్నాం. పూర్తిగా విద్యార్థులు లేకుంటేనే మూసేస్తాం. కొద్ది మంది విద్యార్థులు ఉన్నా పాఠశాలలను నడిపించేలా చర్యలు తీసుకుంటున్నాం. మూసేసిన పాఠశాలల్లో సైతం విద్యార్థుల సంఖ్య పెంచి తెరిచేలా చర్యలు చేపడతాం.

– రమేశ్‌కుమార్, డీఈఓ

నెలరోజుల వ్యవధిలోనే..

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో ఒక్క నెలలోనే మూడు పాఠశాలలు మూసివేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ మండలంలోని నర్సాయపల్లి, వెంకటగిరి, చౌటతండా పాఠశాలలను విద్యార్థులు లేరన్న కారణాలతో మూసేశారు. నర్సాయపల్లి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే.. అక్టోబర్‌లో ఇద్దరూ బదిలీపై వెళ్లిపోయారు. ఇక్కడ కొత్తగా ఉపాధ్యాయులను నియమించకపోగా.. విద్యార్థులే లేరంటూ బడిని మూసేశారు. వెంకటగిరిలోనూ ముగ్గురు విద్యార్థులు ఉన్నప్పటికీ ఇక్కడి టీచర్‌ను మరోచోట ‘సర్దుబాటు’ చేసి బడిని మూసేశారు. ఇప్పటికే అచ్చంపేట తెల్గిరిగుడిసెలు, గోపాల్‌రావునగర్ పాఠశాలలకు అధికారులు శాశ్వతంగా తాళం వేశారు.

ఇంటి వద్దే ఉంటున్నా..



చౌటతండా పాఠశాలలో ముగ్గురం చదువుతున్నాం. స్కూల్‌లో విద్యార్థులు లేరని బడి మూసేస్తున్నట్లు చెప్పారు. కొన్ని రోజులుగా స్కూల్‌కు తాళం వేసి ఉంటోంది. ఇద్దరు విద్యార్థులు గ్రామంలోని ప్రైవేటు స్కూల్‌కు వెళ్తున్నారు. నేను మాత్రం ఇంటి వద్దే ఉంటున్నాను.

– కార్తిక్, విద్యార్థి, చౌటతండా, బల్మూరు మండలం

బడిని తెరిపించాలి..



ఏళ్లుగా విద్యార్థులతో కళకళలాడిన పాఠశాలలను అర్ధంతరంగా మూసివేయడం సరికాదు. చాలావరకు పాఠశాలల్లో ఐదు తరగతులకు కలిపి ఒకే టీచర్ ఉండటంతో తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, ప్రజల్లో నమ్మకం కలిగించాలి. కానీ, బడులను మూసేస్తే పేద విద్యార్థులు ఏం కావాలి. ఉన్నతాధికారులు దృష్టిసారించి బడిని తెరిపించాలి.

– శంకర్‌నాయక్, నర్సాయపల్లి, బల్మూరు మండలం

క్లుప్తంగా

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

- భార్య పరిస్థితి విషమం

జడ్చర్ల: జడ్చర్ల, కల్వకుర్తి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల సమీపంలోని ప్రధాన రహదారిపై గంగాపూర్ శివారులో మిడ్జిల్ మండలం రెడ్డిగూడకు చెందిన జైపాల్ (45), శౌరిలమ్మతో దంపతులు మోటార్ బైక్‌పై వస్తుండగా.. ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టారు. ప్రమాదంలో జైపాల్ అక్కడిక్కడే మృతి చెందగా.. అతడి భార్య తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు 108 వాహనంలో బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. శౌరిలమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి బాలుడి..


నితిన్ (ఫైల్)

బిజినేపల్లి: మండల కేంద్రంలోని లింగమయ్య కాలనీలో ఏడేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని లింగమయ్య కాలనీలో నివాసం ఉంటున్న రాములు, అనూష దంపతుల కుమారుడు నితిన్(7) పాఠశాలకు వెళ్లడానికి గురువారం ఉదయం రోడ్డు పైకి వస్తుండగా.. అటుగా వస్తున్న ట్రాక్టర్ కిందపడి బాలుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కారు బోల్తా.. డ్రైవర్..

ఆర్మూర్ టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పెర్కిట్ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు బోల్తా పడింది. ఈ ఘటనలో వనపర్తికి చెందిన కారు డ్రైవర్ ప్రకాశ్(18) మృతిచెందాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన మద్దెల చందు, ఆర్మూర్ మండలం కోటార్మూర్‌కు చెందిన అక్షయ్ స్నేహితులు. అక్షయ్ బంధువుల వివాహంలో పాల్గొనడానికి చందు హైదరాబాద్ నుంచి కారు అద్దెకు తీసుకొని వచ్చాడు. బుధవారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో డ్రైవర్ ప్రకాశ్‌తోపాటు మరో ఆరుగురు టీ తాగేందుకు కారులో వెళ్తుండగా.. పెర్కిట్ శివారులోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రకాశ్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశ్‌ను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గడ్డిమందు తాగి యువకుడి బలవన్మరణం


బాల్‌రాజ్ (19)

మహమ్మదాబాద్: తన ప్రేమను కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదనే క్షణికావేశంతో గడ్డిమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గండేడ్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెన్నాచేడ్ గ్రామానికి చెందిన తలారి అంజిలయ్య కుమారుడు తలారి బాల్‌రాజ్ (19) ప్రేమకు కుటుంబ సభ్యులు అడ్డు చెప్పడంతో మనస్తాపానికి గురై ఈనెల 11న గడ్డిమందు తాగాడు. వెంటనే చికిత్స కోసం యువకుడిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ గురువారం ఆస్పత్రిలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి అంజిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

కొడుకు మందలించాడని తల్లి ఆత్మహత్య

ఖిల్లాఘనపురం: కల్లు తాగొద్దని కొడుకు మందలించడంతో మనస్థాపానికి ఓ తల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మానాజీపేటలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తలారి కాశమ్మ (68) తరుచుగా కల్లు తాగేది. కల్లు తాగొద్దని తల్లిని కుమారుడు మందలించాడు. దీంతో కాశమ్మ మనస్థాపంతో క్షణికావేశానికి గురై గ్రామం సమీపంలో ఉన్న పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు తలారి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పర్సనల్ లోన్ పేరిట సైబర్ మోసం

నాగర్‌కర్నూల్ క్రైం : పర్సనల్ లోన్ పేరిట సైబర్ నేరగాళ్లు వ్యక్తిని మోసం చేసిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన ఆకుతోట సాయిరామ్‌కు ఓ గుర్తు తెలియని సైబర్ నేరగాడు ఫోన్ చేసి పర్సనల్ లోన్ ఇస్తానని నమ్మించాడు. ఇదే క్రమంలో అతని నుంచి రూ. 99 వేలు అతని అకౌంట్‌లో వేయించుకున్నాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శ్రీఆంజనేయం..


మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామి ఆలయం


స్వామివారి మూల విరాట్

నేటి నుంచి పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు

- 19వ తేదీ వరకు కొనసాగింపు
- 15న రథోత్సవం
- ఏర్పాటు పూర్తిచేసిన నిర్వాహకులు

మక్తల్: పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. సాధారణంగా ప్రతి గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహాలు తూర్పు ముఖమై ఉంటాయి. కానీ ఇక్కడ స్వామివారు పశ్చిమ (పడమటి) దిశకు కొలువుదీరి ఉండటం విశేషం. ఇలాంటి విగ్రహం దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేదని పురావస్తుశాఖ అధికారులు చెబుతున్నారు. ఆలయ గర్భగుడికి పైకప్పు లేకపోవడం విశేషం. గతంలో పైకప్పు నిర్మిస్తే బీటలువారి పడిపోయిందని పూర్వీకులు చెబుతున్నారు. సుమారు ఏడు అడుగుల పైనున్న స్వామివారి భారీ విగ్రహం భూమిపై ఎలాంటి ఆధారం లేకుండా నిలబడి ఉండటం మరో విశేషంగా చెప్పవచ్చు.

- మహబూబ్‌నగర్–రాయచూర్ అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని జాంబవంతుడు ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. స్వామివారిని నిష్ఠతో 41 రోజుల పాటు కొలిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రతి ఏటా మార్గశిర మాసంలో బ్రహ్మోత్సవాలు, పౌర్ణమి రోజున రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 19 శనివారం వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త ప్రాణేష్‌చారి, ఈఓ శ్యాంసుందరాచారి గురువారం తెలిపారు. కార్యక్రమాల నిర్వహణ వివరాలను ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

- శుక్రవారం ఉదయం 7 గంటలకు ఉత్తరాది మఠం నుంచి ఆలయం వరకు స్వామివారి ఊరేగింపు, 7.30కి అంకురార్పణం, ధ్వజారోహణం, అలంకారోత్సవం, 8 గంటలకు హనుమద్వ్రతం, సాయంత్రం గజవాహన సేవ.
- 14న ఉదయం పవమాన హోమం, సాయంత్రం మయూర వాహనసేవ, 6 గంటలకు ప్రభోత్సవం.
- 15న మధ్యాహ్నం మూడు గంటలకు పల్లకీసేవ, సాయంత్రం నాలుగు గంటలకు రథంపై స్వామివారికి మంగళహారతులు, 6 గంటలకు రథోత్సవం.
- 16న సాయంత్రం 5 గంటలకు హంసవాహన సేవ, 6.30కి పాల ఉట్లు.
- 17న ఉదయం 10 గంటలకు చక్రతీర్థం, 11 గంటలకు అశ్వవాహన సేవ.
- 18న సాయంత్రం ఆరు గంటలకు ఉష్ట్రవాహన సేవ
- 19న సాయంత్రం ఆరు గంటలకు కల్పవృక్ష వాహన సేవ

వీటితో పాటు ప్రతిరోజు ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 8 గంటలకు పంచామృత అభిషేకం, ఆకుపూజ, మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన, సాయంత్రం ఆరు గంటలకు వాహన సేవల అనంతరం మహా మంగళహారతి, అవధారలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

కొలిచిన వారి కొంగు బంగారం కాళికాదేవి

- రామచంద్రాపూర్‌లో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 18న ఎల్లమ్మ దేవత సిడె వేడుక


రామచంద్రాపూర్ ఊరగుట్టపై వెలసిన కాళికాదేవి దేవస్థానం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని రామచంద్రాపూర్ గ్రామ ఊరగుట్టపై వెలసిన కాళికాదేవి అమ్మవారి దేవస్థానం కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతుంది. ఇంత విశిష్టత గల అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా.. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ దేవత సిడె కార్యక్రమాన్ని 18న నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఉత్సవాలు జరిగే ప్రతిరోజు అమ్మవారి సన్నిధిలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విశేషోత్సవాలు ఇలా..

కాళికాదేవి అమ్మవారి 36వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల మొదటి రోజు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం తుల్జాభవాని ధ్వజారోహణం, శనివారం యజ్ఞం, నాగదేవతా పూజలు, ఆదివారం అమ్మవారి రథోత్సవం, సోమవారం గంగాదేవి బిందెసేవ, మహిషాసురమర్ధిని, మంగళవారం అమ్మవారికి బోనాలు, బుధవారం ఎల్లమ్మ దేవతకు సిడె తిప్పుట, గురువారం భూలక్ష్మీదేవికి గొర్రె, మేకపోతులతో బండ్లుతిప్పుట, శుక్రవారం అమ్మవారికి అమృత స్నానం పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

36 ఏళ్లుగా ఉత్సవాలు



అమ్మవారి ఉత్సవాలను 36 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం. మా నాన్న కుర్వ మల్లయ్య ఆధ్వర్యంలో దేవస్థానాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించడం ప్రారంభించారు. భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అందరూ సహకరించాలి.

– ఆనంద్, దేవస్థాన నిర్వాహకులు, రామచంద్రాపూర్

ఆటోమేటిక్ అలారం



ప్రజలు సొంత పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లినప్పుడు ఇటీవల చాలా చోట్ల దొంగతనాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు విద్యార్థిని నిఖిత ఆటోమేటిక్ అలారాన్ని కనుగొన్నారు. బయటికి వెళ్లే క్రమంలో అలారం ఆన్ చేసి వెళ్తే మన ప్రమేయం లేకుండా వ్యక్తులు డోర్ తెరిచినప్పుడు పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. దీంతో చుట్టుపక్కల వారు అలర్ట్ అయ్యేందుకు అవకాశం ఉంది.

– నిఖిత, జెడ్పీహెచ్‌ఎస్ ఇబ్రహీంబాద్

స్మార్ట్ చేతికర్ర.. ఇంటి నమూనా



కళ్లు కనిపించని వారికి సహాయం చేయాలన్న ఉద్దేశంతో స్మార్ట్ చేతికర్ర, స్మార్ట్ ఇంటి నమూనాలను విద్యార్థులు శృతి, సాక్షి ఆవిష్కరించారు. ఈ మేరకు స్మార్ట్ చేతికర్రతో బయటికి వెళ్లిన వ్యక్తికి ఆ కర్ర ఎదురుగా ఏదైనా వస్తువు వస్తే వెంటనే అలారం వచ్చే విధంగా రూపొందించారు. దీంతోపాటు స్మార్ట్ హోంలో ఎవరైనా బయటి వ్యక్తులు వెళ్తే ఆటోమేటిక్‌గా అలారం శబ్దం చేస్తుంది. దీంతో కళ్లు కనిపించని అంధులకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులు పేర్కొన్నారు.

– శృతి, సాక్షి, శ్లోక స్కూల్, జడ్చర్ల

ఆవిష్కరణలు అదరహో

జిల్లాకేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శన విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తించింది. విద్యార్థుల ఆవిష్కరణలు సమాజ ప్రగతికి దోహదపడేలా.. శాస్త్ర, సాంకేతిక అంశాలపై పట్టుసాధించేలా గొప్పగా ఆవిష్కరించారు. సాధారణ ప్రజల నుంచి శాస్త్రవేత్తలు ఇలా ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా తమ చిట్టి బుర్రలతో ఎంతో మేలు చేకూర్చే ఆవిష్కరణలకు రూపమిచ్చారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

ఫైర్ స్ప్రింక్లింగ్ రోబోట్..



భవనాలు ఇతర చోట్ల మంటలు అంటుకున్న సమయంలో వ్యక్తుల ప్రమేయం లేకుండా నేరుగా రోబో సహాయంతో నీటిని పోసి ఆర్పే విధంగా విద్యార్థిని తేజశ్రీ ఫైర్ స్ప్రింక్లింగ్ రోబోట్‌ను ఆవిష్కరించారు. దీని ద్వారా మంటలు ఆర్పే క్రమంలో వ్యక్తులకు గాయాలు కాకుండా పూర్తి ఖచ్చితత్వంతో మంటలు ఆర్పే రోబోను ఆవిష్కరించారు. దీని ద్వారా మనుషులకు మంటల్లో ఇబ్బంది కలగకుండా నేరుగా నీటిని పోసే ఆస్కారం ఉందని విద్యార్థులు తెలిపారు.

– తేజశ్రీ, జెడ్పీహెచ్‌ఎస్, చిన్నవార్వాల్

అవసరాలు తీర్చే రోబో..



ఇంట్లో చిన్నపాటి అవసరాలను తీర్చేలా.. తక్కువ ఖర్చుతో ఇంట్లో లభించే వస్తువులతో కావేరమ్మపేట విద్యార్థులు చిన్నపాటి రోబోను ఆవిష్కరించారు. దీంతో ఇంట్లో చిన్నపాటి వస్తువులను మోసుకెళ్లడం, చిన్నపిల్లలు కాలక్షేపం చేసే విధంగా వారిని ఆడించడం వంటి పనులను ఈ రోబో చేస్తుంది. వీటి వల్ల ఇంట్లో అవసరాలు తీర్చే అవకాశం ఉన్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు.

– చందు, వరుణ్, కావేరమ్మపేట, జడ్చర్ల

మ్యాథ్స్ పార్క్..



విద్యార్థులకు ఆటలతోపాటు గణిత ప్రక్రియలు నేర్చుకునేందుకు వీలుగా విద్యార్థులు అలేఖ్య, హిమశ్రీలు మ్యాథ్స్ పార్కులను ఆవిష్కరించారు. దీంతో పార్కులో ఉండే ఒక్కో ఆట వస్తువుతో ఒక్కో విధమైన గణిత ప్రక్రియను ఏర్పాటు చేశారు. వాటి ఆధారంగా వివిధ గణిత సూత్రాలు, ప్రక్రియలను నేర్చుకునేందుకు అవకాశం ఉందని విద్యార్థులు పేర్కొన్నారు.

– అలేఖ్య, హిమశ్రీ, నాగార్జున స్కూల్

రీసైకిల్ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్..



ఇటీవల ప్లాస్టిక్ వినియోగం వల్ల కాలుష్యంతో పాటు సకల జీవరాశికి విపత్కర పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో రీసైకిల్ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని విద్యార్థులు ఆవిష్కరించారు. దీనివల్ల ప్లాస్టిక్‌లో వివిధ రకాల కవర్లు, వాటర్ బాటిళ్లు సులువుగా రీసైకిల్ చేసే విధంగా రూపొందించారు. దీని ద్వారా తక్కువ ఖర్చుతో ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసేందుకు అవకాశం ఉంది.

– మహ్మద్‌ఫర్హాన్, మంజునాథ్, మాడ్రన్ స్కూల్

పేదల తిరుపతి 'ఆదిశిలాక్షేత్రం'

నేడు స్వామి వారి కల్యాణోత్సవం

- 14న తెప్పోత్సవం
- 15న రథోత్సవం


ఆలయ శిఖరం

మల్దకల్: పేదల తిరుపతిగా పేరొందిన మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో ప్రతి ఏటా డిసెంబర్ మాసంలో నిర్వహించనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 12 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, 14న తెప్పోత్సవం, 15న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్య చంద్రారెడ్డి తెలిపారు.

కోరిన కోర్కెలు తీర్చే బాంధవుడిగా..

స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని స్థానిక ప్రజలు కోరిన కోర్కెలు తీర్చే భక్తజన బాంధవుడిగా కొలుస్తారు. ఆదిశిలా వాసుడుని తిమ్మప్ప స్వామి , శ్రీనివాసుడు, మల్దకల్ రాయుడిగా సంభోదిస్తుంటారు. కులమతాలకు అతీతంగా స్థానిక ప్రజలు పూజలు చేసి మొక్కులు చెల్లిస్తుంటారు.


మూలవిరాట్ వేంకటేశ్వరస్వామి

మల్దకల్ క్షేత్ర మహత్యం..

మల్దకల్ క్షేత్ర మహత్యం బ్రహ్మాండ పురాణంలో వర్ణించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ క్షేత్రంలో క్షేత్రమూర్తి శివుడు అయినా విష్ణు దేవాలయంగా వెలుగొందుతోంది. బ్రహ్మదేవుడు మొదట ఓ శిలను సృష్టించి ఆదిశిలా అని పేరు పెట్టినట్లు ప్రశస్తి. శివుడు ఇక్కడ తపస్సు చేయగా స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి సాక్ష్యాత్కరించి దశావతారాలు స్తుతించగా మెచ్చి ఈ ఆదిశిలకు గిరీశచలమని పేరెడినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి. తదనుగుణంగా ఒకే శిలలో స్వయంభుగా శ్రీనివాసుడు అనిరుద్ధరూపంలో అవతరించాడు.

పశుపక్ష్యాదుల రూపంలో సేవలు..

ఆదిశిలా క్షేత్రంలో దేవతలు పశు, పక్ష్యాది రూపంలో వేంకటేశ్వరుడిని సేవిస్తూ తత్వజ్ఞానం పొందుతారని పురాణాల్లో పేర్కొన్నారు. ఇక్కడ వెలసిన రుద్రరూపంలో అంటే చతుర్భుజంలో ఉండి శంఖు చక్రాలతో... ఒక హస్తం నడుముపై, మరో హస్తంపై పాదములు చూపుతూ వెలిశాడు వేంకటేశ్వరుడు. సంసారం అనే భావ సాగరంలో మునిగి తేలుతున్న మానవాళికి తన పాదసేవ చేస్తే మోక్ష దాయకమని విరాజిల్లుతున్నాడు.

వాల్మీకులే పూజారులు..

ఆదిశిలా క్షేత్రంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామిని వాల్మీకులు పూజారులుగా పూజలు చేస్తుంటారు. ఆలయంలో జరిగే తొలి పూజల్లో వాల్మీకులే ముందుంటారు. ఆలయంలో పూజలు చేసే వాల్మీకులకు దేవుడి పేరుతో మాన్యాలు ఉన్నాయి. వాటి ద్వారా ఆలయంలో దేవుడికి సేవలు చేయడం గమనార్హం.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

శుక్రవారం నాడు జరిగే కల్యాణోత్సవ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథిగా హాజరవనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. వైభవంగా జరిగే ఈ కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొనున్నారు.


ఆలయ ముఖద్వారం

మార్మోగుతున్న హనుమాన్ నామస్మరణ

అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగు క్షేత్రంలో వెలిసిన పబ్బతి ఆంజనేయస్వామి ఉత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా హనుమాన్ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రాంగణం హనుమాన్ మాలధారులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి సన్నిధిలో దీక్షమాల విరమించారు. ఆలయ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రంగాచారి, అర్చకులు వీరయ్యశాస్త్రి బృందం ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పంచగవ్యం, వాస్తుపూజ, హోమం, రుద్రహోమం, స్వామి వారికి సహస్రనామార్చన, మన్యు సూక్తహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ విజేత పాలమూరు


హోరాహోరీగా బాలుర ఫైనల్ పోటీలు

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని ఏకే అకాడమీ క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 వాలీబాల్ పోటీల్లో పాలమూరు జట్లు విజేతగా నిలిచాయి. హోరాహోరీగా గురువారం జరిగిన ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జిల్లా బాలుర, బాలికల జట్లు విజయం సాధించాయి. ఉమ్మడి పది జిల్లాలకు సంబంధించి బాలబాలికల జట్లు హాజరు కాగా, బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ప్రథమ స్థానం, ఖమ్మం జట్టు ద్వితీయ స్థానం, కరీంనగర్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలోనూ మహబూబ్‌నగర్ జట్టు ప్రథమ స్థానం, నిజామాబాద్ జట్టు ద్వితీయ స్థానం, కరీంనగర్ జట్టు తృతీయ స్థానం సాధించాయి. క్రీడల ముగింపు కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేష్ శెట్టి, పెటా టీఎస్ కార్యదర్శి బాల్‌రాజ్, మాజీ ఎంపీపీ మధుకర్ రావు, మాజీ జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ గుండుమాల్ మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల్‌రాజ్, పీడీలు నర్సింహ, రవి, సాయినాథ్, చంద్రశేఖర్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాధిక, స్వప్న, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

చిన్నచింతకుంట: షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన చిన్నచింతకుంట మండలం పల్లమరి గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలకు వెళితే.. గ్రామానికి చెందిన గట్టుకుల రామంజనేయులు కొన్నేళ్లుగా బీసీ కాలనీలో గుడిసె ఏర్పాటు చేసుకొని భార్య, పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. రామాంజనేయులు బుధవారం గుడిసెకు తాళం వేసి కుటుంబంతో కలిసి అడ్డాకుల మండలంలోని ముంగల్‌చేడ్ గ్రామానికి తన బంధువుల పెళ్లికి వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి గుడిసెకు నిప్పంటుకోవడంతో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. గుడిసెలో ఎవరూ లేని కారణంగా పెను ప్రమాదం తప్పింది. కుట్టు మిషన్, 50 వేల నగదు, బియ్యం బస్తాలు, సైకిల్, బట్టలు, పట్టా దారు పాస్ బుక్కులు, బ్యాంకు పాసుబుక్కులు, వంట సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఘటన స్థలానికి తహసీల్దార్ ఎల్లయ్య చేరుకొని పంచనామా నిర్వహించి, దాదాపుగా రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.10వేల నగదు, 50 కిలోల బియ్యం అందించారు. ఘటనను ఉన్నతాధికారులకు నివేదిక పంపించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

క్లుప్తంగా

కోర్టు సముదాయాలను తరలించొద్దు

గద్వాల క్రైం: జిల్లా కోర్టు సముదాయాలను తరలించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు బీజేపీ నాయకులు రాంచంద్రారెడ్డి, శివారెడ్డి అన్నారు. గురువారం గద్వాల బార్ అసోసియేషన్ సభ్యులను కలసి మాట్లాడారు. పట్టణ శివారులోనే నూతన కోర్టు సముదాయాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ విషయంలో బీజేపీ పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతుందన్నారు. కక్షిదారులకు అందుబాటులో కోర్టు సముదాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి నుంచి పూడూర్ శివారులోని నూతన సముదాయాల ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్లతో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బార్ అసోసియేషన్ సభ్యులు రఘురామిరెడ్డి, ఖాజ్జమొయిన్నుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పునఃప్రారంభం



గట్టు : మండల పరిధిలోని చాగదొణ ప్రాథమిక పాఠశాలలో నిలిచిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని గురువారం పునఃప్రారంభించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు రాక పోవడంతో బుధవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించలేక పోయారు దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వంట ఏజెన్సీలో కొంత మంది వంట చేయడానికి ముందుకు వచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని, వంట ఏజెన్సీ నిర్వాహకులు హామీ ఇవ్వడంతో విషయాన్ని ఎంఈఓ నల్లారెడ్డి దృష్టికి తీసుకువచ్చినట్లు హెచ్ఎం అయ్యస్వామి తెలిపారు. ఎంఈఓ సూచనల మేరకు ప్రస్తుతానికి పాత వంట ఏజెన్సీ నిర్వాహకులతోనే మధ్యాహ్న భోజనం తయారు చేయించి, అందజేసినట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని గంజిపేటకు చెందిన రాజు సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. గతేడాది నుంచి నోటి క్యాన్సర్‌తో పనికి వెళ్లలేని స్థితిలో ఇంటికే పరిమితమై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్స్‌బులిటీ బృందం సభ్యులు గురువారం రాజు ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.40,301 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్, సోషల్ రెస్పాన్స్‌బులిటీ బృందం సభ్యులు అశోక్, మోహన్, మురళి, నాగేష్, ఖాజ, రామన్న, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో పూజలు



పాన్‌గల్: మండల కేంద్రంలో గీతా జయంతి వేడుకలను గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భగవద్గీత శ్లోకాలు ఆలపించి వాటి భావాలు వివరించారు. ఈ సందర్భంగా పోతులమడుగు సీతారామ ఆంజనేయ ఆశ్రమం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమం పీఠాధిపతి పూజ్యశ్రీ తిరుపతి తీర్థానంద స్వామి, ఆశ్రమం ఉత్తర పీఠాధిపతి పూజ్యశ్రీ వెంకట్ చరణ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

పల్లెవెలుగు కానరాదాయె

- ఆర్టీసీ సౌకర్యం లేక ప్రయాణికుల అవస్థలు
- ఉచిత బస్సుకు నోచుకోని పల్లె మహిళలు
- పరిమితికి మించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు



బొలెరో వాహనంలో విచ్చలవిడిగా ఎక్కించుకున్న వాహనదారుడు



పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న ప్రజలు

ఎర్రవల్లి: రోడ్డు సౌకర్యం సక్రమంగా ఉన్నా గానీ పల్లెలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవలి చౌరస్తా నుంచి షేకుపల్లి మీదుగా సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, పాత గార్లపాడు వరకు బీటీ రోడ్డు సక్రమంగా ఉన్నా.. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లోనే ప్రయాణం సాగిస్తున్నారు. అదే విధంగా పొగాకు కంపెనీ నుంచి మునగాల, ఇటిక్యాల మండల కేంద్రం, ఉదండాపురం, చాగాపురం, షాబాద్, సాతర్ల, వావిలాల వరకు ఆర్టీసీ బస్సులు సకాలంలో తిరగకపోవడంతో వందల సంఖ్యలో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకు ప్రయాణం సాగిస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వాహనాలతో తిప్పలు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో పలు గ్రామాలకు బస్సు వసతి లేని కారణంగా ప్రజలు నిత్యం ప్రైవేటు వాహనాల ద్వారానే ప్రయాణం చేస్తున్నారు. గద్వాల డిపో నుంచి మూడు రూట్లలో ఉదయం నుంచి రాత్రి వరకు పల్లెల మీదుగా ఆర్టీసీ బస్సులు నిత్యం తిరిగేవి. కానీ కరోనా కారణంగా లాక్‌డౌన్ నుంచి కేవలం విద్యార్థుల కోసమే ఉదయం, సాయంత్రం వేళల్లో ఒకసారి మాత్రమే బస్సు తిరుగుతుంది. బస్సు సౌకర్యం లేని కారణంగా ప్రజలు ప్రైవేటు వాహనాలు ఆశ్రయిస్తూ పరిమితికి మించి ఎక్కడంతో ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాల పాలై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

పరిమితికి మించి ప్రయాణం..

నిత్యం ఎర్రవల్లి, ఇటిక్యాల మండల కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇష్టాను సారంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు గురి చేస్తున్నారు. దీనికి తోడు తమదే ఇప్పుడు రాజ్యం అంటూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పల్లెలకు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలి..



ఎర్రవల్లి చౌరస్తా నుంచి గార్లపాడుకు వెళ్లేందుకు గాను ఆర్టీసీ బస్సు లేని కారణంగా ప్రయాణం చేయడానికి ఇబ్బందులు తప్పడం లేదు. పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు ప్రయాణం చేయాల్సి వస్తే బస్ లేకపోవడం వల్ల ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి బస్ సౌకర్యం కల్పించాలి. – తెలుగు రాముడు, గార్లపాడు గ్రామం.

ఉన్నతాధికారులు స్పందించాలి..



గ్రామాలకు బస్సులు తిరగకపోవడం వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావట్లేదు. ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణాలు కొనసాగిస్తుండటంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అధికారులు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు యధాతథంగా నడపాలి. – బోయ లక్ష్మన్న, సాసనూలు గ్రామం.

ఉన్నత లక్ష్యం కోసం కృషిచేయాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న అధికారులు

గట్టు : ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పచుకుని దాని కోసం కృషి చేయాలని జిల్లా ఉపాధి కల్పన, గట్టు మండల ప్రత్యేక అధికారిణి డాక్టర్ ప్రియాంక అన్నారు. గురువారం మాచర్ల, బోయలగూడెం పాఠశాలలను అధికారులతో కలిసి సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట గదులు శుభ్రంగా ఉంచాలని నాణ్యమైన భోజనం అందించాలి వంట ఏజెన్సీలకు సూచించారు. బోయలగూడెం పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌కు సంబంధించి పలు అంశాలపై డాక్టర్ ప్రియాంక అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు నమ్మకాన్ని నిలబెట్టే విధంగా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహా, జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న, ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



ఆనంద మార్గ ఆశ్రమంలో నాయకులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలోని ఆనంద మార్గ ఆశ్రయాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు సందర్శించారు. గురువారం ఆశ్రమంలో ఉన్న వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రఘురెడ్డి, మద్దిలేటి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

గద్వాల: సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజు కొనసాగింది. వీరికి బీజేపీ మద్దతు ప్రకటిచింది. ఈ మేరకు వారు సమ్మె చేస్తున్న దీక్ష శిబిరం వద్ద సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పీఆర్‌టీయూ నాయకులు మద్దతు పలికారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సర్వీస్ ఇస్తున్న సమాన పనికి సమాన వేతం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరికి పేస్కేల్ అమలు చేయాలని, జీవిత బీమా రూ.20లక్షలు, ఆరోగ్య బీమా రూ.10లక్షల వరకు సౌకర్యం కల్పించాలన్నారు. పదవీ విరమణ చేసిన వారికి రూ.25 లక్షల బెనిఫిట్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉషనప్ప, గోపాల్, శేషన్న, కేజీబీవీ, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలి

మానవపాడు: జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులును గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్ నాయుడు, కాంగ్రెస్ యువజన నాయకుడు శేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి పంపిణీ



వస్తువులు పంపిణీ చేస్తున్న సీడీపీఓ సుజాత

మానవపాడు: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లకు గురువారం ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో చిన్నారులకు సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ సెంటర్లకు రెక్టాంగిల్ టేబుల్, ప్లేమ్యాట్స్, బుక్ ర్యాక్స్, ఏకరూప దుస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన అంబులెన్స్ మంజూరు



అంబులెన్స్ అందని ద్రాక్షే..

సాక్షిలో ప్రచురితమైన అంబులెన్స్ అందని ద్రాక్షే శీర్షిక



108 అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఎర్రవల్లి: సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి తెలంగాణ ఆరోగ్యశాఖ స్పందించింది. గత నెల అక్టోబర్ 19న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అంబులెన్స్ అందని ద్రాక్షే' అనే శీర్షికకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన 108 అంబులెన్స్ కేటాయించింది. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన 108 అంబులెన్స్ వాహనం వచ్చింది. మండల వైద్యాధికారి రాధిక సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాన్ని ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా 108 సౌకర్యం లేక ప్రజలు పడుతున్న సమస్యను గుర్తించి ప్రచురించడం వలనే మండలానికి 108 సౌకర్యం లభించిందని పలువురు సాక్షి దినపత్రికను అభినందించారు.

లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే



కేటీదొడ్డిలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

కేటీదొడ్డి: లబ్ధిదారుల గుర్తింపునకు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఇంటింటా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు చేపట్టారు. లబ్ధిదారుడి ఫొటో, భూమి పత్రాల వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇంటి యాజమానులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే..

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఒకటైన ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతోంది. అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మున్సిపాలిటీలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాజయ్య, మండలంలో ఎంపీడీఓ వెంకటయ్య ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్ : వరద బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమదాసు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారి లక్ష్మీనారాయణను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2009లో కృష్ణా–తుంగభద్ర వరదలు సంభవించినపుడు అలంపూర్ పట్టణంలోని సంతనగర్ కాలనీ వాసులు సర్వం కోల్పోయినట్లు తెలిపారు. 15 ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఇప్పటికీ ఎలాంటి సాయం అందలేదన్నారు. ఏళ్ల తరబడి కాలనీ వాసులు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్న సమస్య పరిష్కారం కాలేదన్నారు. కాలనీ వాసుల దయనీయ స్థితి దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రేపల్లె దేవదాసు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైస్ మిల్లును ప్రారంభిస్తున్న నాయకులు

గట్టు : రైస్ మిల్లును రైతులు సద్వినియోగం చేసుకోవాలని గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉరుకుంద స్వామి రైస్ మిల్లును గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేత హనుమంతు నాయుడు, కాంగ్రెస్ నాయకుడు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పలకల కోలు భజన



భజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాసు హనుమంతునాయుడు

కేటీదొడ్డి: మండల పరిధిలోని మల్లాపురంలో సుంకులమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలకల కోలు భజన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోనేష్, రాము, రాజు, నూర్‌భాష, తిరుమల్, కామేష్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

అమరచింత: సీసీ కెమెరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్ఐ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో గురువారం సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమనే విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చోరీలు, హత్యలు, అసాంఘిక కార్యక్రమాల వంటి వాటిని జరిగినప్పుడు సీసీ కెమెరాల ఉన్నట్లయితే నిందితులను గుర్తించవచ్చన్నారు. గ్రామంలోని చౌరస్తాలతో పాటు ప్రధాన రహదారులు, పాఠశాలలు, ఆలయాలు, ప్రార్థన మందిరాలు ఉన్న ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని కోరారు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూర్: రాష్ట్రప్రభుత్వం విద్యారంగంపై దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా సిరాజుద్దీన్, అధ్యక్షుడిగా రియాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా సత్యమ్మ, కిరణ్, ప్రధానకార్యదర్శిగా సురేష్, సహాయకార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా సల్మాన్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే



కొంకలలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

అయిజ: విద్యార్థులకు చదువుతో పాటూ క్రీడలూ ముఖ్యమేనని తహసీల్దార్ జ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలు ముగింపు కార్యమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం అందించే అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెకంటయ్య, ఎంఈఓ రాములు, మున్సిపల్ కౌన్సిలర్లు శేక్షావలి ఆచారి, రాణెమ్మ, పీఈటీలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక..

మానవపాడు: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ రమణరావు తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహి ంచారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధికారులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధరూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు..

శాంతినగర్ : సీఎం కప్ ఆటల పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎంపీడీఓ రామకృష్ణ ప్రశంసా పత్రాలు అందజేశారు. వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు గురువారం సీఎం కప్ ఆటల పోటీలు కొనసాగాయి. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎంఈఓ నరసింహ, ఎంపీడీఓలు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత..

ధరూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. గురువారం సాయంత్రం ముగింపు క్రీడల్లో వాలీబాల్ బాలికల విభాగంలో మొదటి బహుమతి ధరూరు జట్టు నిలవగా.. సెకండ్ ప్రైజ్ ఉప్పేరు జట్టు నిలిచింది. కబడ్డీలో ధరూరు జట్టు, సెకండ్ రేవులపల్లి, ఖోఖో ఉమెన్స్ ధరూరు జట్టు, సెకండ్ రేవులపల్లి జట్లు నిలిచాయి. ఎంపీడీఓ మంజుల, ఎంఈఓ రవీంద్రబాబు, జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డిలు విజేతలకు బహుతమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



అయిజలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ జ్యోతి



మానవపాడులో బహుమతులు అందజేస్తున్న అధికారులు

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ క్రాంతికుమార్

శాంతినగర్ : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ తొగరు క్రాంతికుమార్ అన్నారు. వడ్డేపల్లిలో గురువారం ఖాతా దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ.. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, ఐఎఫ్ వంటి స్కీమ్‌ల ద్వారా ఎలా లబ్ధి పొందాలన్న విషయమై వివరించారు. ఏపీజీవీబీ బ్యాంక్‌లో సులభంగా రైతులు, ఖాతాదారులు రుణాలు పొందవచ్చన్నారు. వచ్చే జనవరి నుంచి ఏపీజీవీబీ, టీజీబీ బ్యాంకులు రెండు కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా పనిచేస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.